క్లుప్తంగా

ఎంపీ కేశినేని నానికి అభినందనలు



ఇబ్రహీంపట్నం: ఎంపీ కేశినేని నానిని జెడ్పీ వైస్ చైర్మన్ గరికపాటి శ్రీదేవి మర్యాద పూర్వకంగా విజయవాడ కేశినేని భవన్‌లో బుధవారం కలిశారు. ఆయన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి టీడీపీకి రాజీనామా చేస్తానని ప్రకటించడంతో పాటు వైఎస్సార్ సీపీలో చేరికపై సానుకూలత వ్యక్తం చేసిన నేపథ్యంలో పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. నియోజవర్గం పరిధిలో ఎంపీ నాని అందించిన టాటా ట్రస్ట్ సేవలు, అభివృద్ధి పనులు ప్రజల గుండెల్లో నిలిచిపోయాయని శ్రీదేవి తెలిపారు. జెడ్పీ వైస్ చైర్మన్ శ్రీదేవిని ఎంపీ నాని శాలువాతో సత్కరించారు. సర్పంచ్ రెంటపల్లి నాగరాజు, మండల కోఆప్షన్ సభ్యుడు పఠాన్‌నాగుల్ మీరా, వైఎస్సార్ సీపీ నాయకులు రాంబాబు, వెంకటరావు, విజయ్, బాలాజీ ఎంపీని కలిసిన వారిలో ఉన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధన దిశగా పథకాలు

చంద్రాల(మైలవరం): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధన దిశగా నేడు ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలను బడుగు బలహీన వర్గాలకు అందించడంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ముందున్నారని వైఎస్సార్ సీపీ రైతు విభాగం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు జొన్నలగడ్డ గంగాధరరావు తెలిపారు. మైలవరం మండలం చంద్రాల సచివాలయంలో సామాజిక సమతా సంకల్పం కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ జ్యోతి అధ్యక్షతన సమావేశం జరిగింది. సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీపై సంతకాలు సేకరించారు.

నూతన పెన్షన్ విధానం రద్దు చేయాలి

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన పెన్షన్ విధానం రద్దు చేయాలని గుంటుపల్లి రైల్వే వ్యాగన్ వర్క్‌షాపు వద్ద సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు, ఉద్యోగులు రిలే నిరాహార దీక్ష బుధవారం చేపట్టారు. బ్రాంచి కార్యదర్శి ఎంపీఎం నాగేశ్వరరావు మాట్లాడుతూ పాత పెన్షన్‌తో రైల్వే ఉద్యోగులకు ఉన్న ప్రయోజనాలు నూతన పెన్షన్ విధానంతో హరించుకుపోయాయన్నారు. పాతపెన్షన్ పునర్ధురణ చేయాలని కోరారు. లేనిపక్షంలో ఉద్యమం ఉధృతం చేస్తామన్నారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడే వారిపై కఠిన చర్యలు

మైలవరం: విద్యుత్ చౌర్యానికి పాల్పడితే నేరమని, దీనికి పాల్పడే వారిపై చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని విద్యుత్‌శాఖ విజయవాడ రూరల్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.బి. శ్రీనివాసరావు తెలిపారు. మైలవరం సెక్షన్ పరిధిలో విద్యుత్ విజిలెన్స్ విభాగం ఆధ్వర్యంలో మైలవరం, పొందుగల, చంద్రగూడెం, పుల్లూరులో బుధవారం విద్యుత్ తనిఖీలు నిర్వహించారు. మొత్తం 3,025 సర్వీసులు తనిఖీ చేయగా వాటిలో 248 సర్వీసులు లోడ్ ఎక్కువగా వినియోగిస్తున్నట్లు గుర్తించి, సుమారు రూ.6,30,000 అపరాధ రుసుం విధించినట్లు తెలిపారు. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సుధాకర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, డీపీఈ బి.నవీన్‌కుమార్, ఏఈ రమేష్ బాబు పాల్గొన్నారు.

ప్రముఖ కమ్యూనిస్టు చెన్నారెడ్డి మృతి



రెడ్డిగూడెం: మండలానికి చెందిన ప్రముఖ కమ్యూనిస్టు యోధుడు తెలంగాణా రైతాంగ సాయుధ పోరాట ఉద్యమంలో చీఫ్ కొరియర్‌గా పనిచేసిన దుగ్గి చెన్నారెడ్డి(97) బుధవారం తెల్లవారుజామున కన్ను మూశారు. చెన్నారెడ్డి మృతి కమ్యూనిస్టు పార్టీలకు తీరని లోటని సీపీఎం నాయకులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. సీపీఎం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాయకులు పీవీ ఆంజనేయులు, చిన్న బాబు, నాగేశ్వరరెడ్డి, నాయకులు ఎం.మాధవరెడ్డి ఆయన మృతదేహానికి నివాళులర్పించారు.

కిడ్నీ బాధితుడికి సీఎం రిలీఫ్ ఫండ్ పత్రాలు అందజేత

ముసునూరు: కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న యువకుడికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.2 లక్షలు నూజివీడు ఎమ్మెల్యే మంజూరు చేయించినట్లు గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కంబాల రాంబాబు తెలిపారు. మండలంలోని కాట్రేనిపాడుకి చెందిన కలపాల నాగేశ్వరరావు కుమారుడు శివశంకరరావు కిడ్నీ సంబంధిత వ్యాధి బారినపడి హైదరాబాద్‌లోని నిజాం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతనికి కిడ్నీ మార్పిడి చేయాలని వైద్యులు నిర్ధారించారు. ఈ విషయాన్ని బాధితుని కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు తెలియజేశారు. స్పందించిన ఆయన ఉన్నతాధికారులతో చర్చించి రూ.2 లక్షలు సీఎం రిలీఫ్ నిధులు మంజూరు చేయించారు. దీనికి సంబంధించిన ఎల్‌ఓసీని బుధవారం బాధితుడి తండ్రికి ఎమ్మెల్యే అందజేశారు. ఎంపీపీ కొండా దుర్గాభవాని, జెడ్పీటీసీ సభ్యుడు డాక్టర్ వరికూటి ప్రతాప్ పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించేందుకే 'ఆడుదాం ఆంధ్రా'

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



నూజివీడులో వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేకా వెంకటప్రతాప్ అప్పారావు

నూజివీడు: క్రీడలను ప్రోత్సహించడానికి, ప్రతిభ కలిగిన క్రీడాకారులను వెలికితీయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా క్రీడా సంబరానికి శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. నూజివీడులోని డీఏఆర్ కళాశాల గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి ఆటల పోటీలను బుధవారం ఎమ్మెల్యే ప్రతాప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 15 ఏళ్ల వయస్సు పైబడిన వారు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని, క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, టెన్నీ కాయిట్ తదితర పోటీలను గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. ఫిబ్రవరి 10వ తేదీ వరకు నిర్వహించనున్న క్రీడా సంబరంలో క్రీడాకారులు పాల్గొనాలన్నారు. క్రీడల్లో గెలిచిన వారికి నియోజకవర్గ స్థాయిలో రూ.35వేలు, జిల్లా స్థాయిలో రూ.60వేలు, రాష్ట్రస్థాయిలో రూ.5 లక్షలు ప్రథమ బహుమతి ఇస్తారని తెలిపారు. క్రీడాకారులు ఆడేందుకు అవసరమైన అన్ని క్రీడా పరికరాలను ప్రభుత్వమే అందిస్తుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, ఎంపీపీ ఆరేపల్లి శిరీష, మండల ప్రత్యేకాధికారి రామ్మోహన్‌రావు, మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, కొమ్ము వెంకటేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ సయ్యద్ అబ్దుల్ రషీద్, ఎంపీడీఓ విజయ్‌కుమార్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము, నాయకులు రాంబాబు, రవీంద్రరెడ్డి, సీఐ ఎంవీవీఎస్ఎన్‌మూర్తి పాల్గొన్నారు.

ఆగిరిపల్లిలో..

ఆగిరిపల్లి: ఆడుదాం ఆంధ్రా క్రీడ పోటీలు గ్రామీణ క్రీడాకారులకు వరం లాంటివని స్పెషలాఫీసర్ సత్యనారాయణ రాజు అన్నారు. బుధవారం ఆగిరిపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో ఆడుదాం ఆంధ్రా మండల స్థాయిలోని క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఎంపీడీఓ శంకరరావు, పంచాయతీ కార్యదర్శులు మీర్జా వలి, కే సంగమయ్య, నవీన్, అంజినీ, క్రీడాకారులు పాల్గొన్నారు.

చాట్రాయిలో..

చాట్రాయి: ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు చాట్రాయి జెడ్పీ హైస్కూల్లో బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి వెంకటరత్నం జట్లను పరిచయం చేసుకుని టాస్ వేసి ఆటలను ప్రారంభించారు. ఎంపీడీఓ కె దుర్గాప్రసాదు పాల్గొన్నారు

కొండపల్లిలో..

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి పోటీలను కొండపల్లి మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ రామకృష్ణ నాయక్ బుధవారం ప్రారంభించారు. ఆయా పాఠశాలల పీఈటీలు, సచివాలయాల కార్యదర్శులు పర్యవేక్షించారు.

రెడ్డిగూడెంలో..

రెడ్డిగూడెం: రెడ్డిగూడెం హైస్కూల్లో ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి పోటీలను బుధవారం జెడ్పీటీసీ సభ్యుడు పాలంకి విజయభాస్కరరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లాది రాణీ, వైస్ ఎంపీపీ-1 చాట్ల రాబర్టు, ఎంపీటీసీ సభ్యుడు కుప్పిరెడ్డి వరప్రసాద్‌రెడ్డి, ఎంపీడీఓ బి.విష్ణు ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి రవికుమార్ పాల్గొన్నారు.

ముసునూరు: నూజివీడు డివిజన్ వ్యాప్తంగా అన్ని మండలాల్లో మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా పోటీలు విజయవంతంగా కొనసాగుతున్నాయని నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ పేర్కొన్నారు. ముసునూరు హైస్కూల్లో నిర్వహిస్తున్న కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, పోటీలను ఎంపీపీ కొండా దుర్గాభవాని, జెడ్పీటీసీ సభ్యుడు డాక్టర్ వరికూటి ప్రతాప్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ నేతలతో కలిసి ఖోఖో, వాలీబాల్ క్రీడాకారులను పరిచయం చేసుకుని వారిని ఉత్సాహపరిచారు. అంతకు ముందు ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యుడు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో క్రీడా కోర్టులను ప్రారంభించారు. పీడీలు ఆలీఖాన్, సుకుమార్, నాగరాజు, నాగమల్లేశ్వరమ్మ పోటీలు నిర్వహిస్తున్నారు. స్టేట్ హిస్టరీ అకాడమీ డైరెక్టర్ స్వరూపరాణి, జిల్లా పార్టీ యూత్ జాయింట్ సెక్రటరీ కోన రమేష్, సర్పంచ్‌లు కంచర్ల వాణి, చలసాని దామోదర్, పిల్లి సత్యనారాయణ, ఆర్.శ్రీదేవి శ్రీనివాస్ పాల్గొన్నారు.

విస్సన్నపేటలో..

విస్సన్నపేట: క్రీడలు వలన శారీరక వ్యాయమంతో పాటు మానసికోల్లాసం పెంపొందుతుందని ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి అన్నారు. స్థానిక జిల్లాపరిషత్ హైస్కూల్లో ఆడుదాం ఆంధ్రా మండలస్థాయి పోటీలు బుధవారం నిర్వహించారు. ఎంపీపీ మెర్సీవనజాక్షి, సర్పంచ్ సాధుపాటి నాగమల్లేశ్వరి, ఎంపీడీఓ వెంకటరమణ పోటీలను ప్రారంభించారు. ఎంఈఓ సుధాకర్, ఇన్‌చార్జి ఈఓ మురళి, పంచాయతీ కార్యదర్శులు రామారావు, ఆదినారాయణ పాల్గొన్నారు.

తిరువూరులో..

తిరువూరు: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా తిరువూరు మండల స్థాయి క్రీడాపోటీలను బుధవారం స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో జెడ్పీటీసీ సభ్యుడు యరమల రామచంద్రారెడ్డి ప్రారంభించారు. కబడ్డీ పోటీల్లో పలు గ్రామాల జట్లు పాల్గొన్నాయి. 11న ఖోఖో, 12న వాలీబాల్, 17 నుంచి 20 వరకు బ్యాడ్మింటన్, క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో నాగేశ్వరరావు తెలిపారు.

యువత క్రీడల్లో రాణించాలి

గంపలగూడెం: యువత క్రీడల్లోనూ రాణించాలని గంపలగూడెం ఎంపీపీ గోగులమూడి శ్రీలక్ష్మి పేర్కొన్నారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా గంపలగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో మండల స్థాయి పోటీలను ఆమె బుధవారం ప్రారంభించారు. జెడ్పీటీసీ సభ్యుడు కోట శామ్యూల్, వైఎస్సార్ సీపీ మండల, పట్టణ అధ్యక్షులు చావా వెంకటేశ్వరరావు, కొత్తగుండ్ల నరసింహారావు, మండల సమాఖ్య అధ్యక్షురాలు వెదురు లింగమ్మ పాల్గొన్నారు.



ఆగిరిపల్లిలో పోటీలను ప్రారంభించిన స్పెషలాఫీసర్ సత్యనారాయణరాజు



చాట్రాయిలో టాస్ వేసి ఆటలను ప్రారంభించిన వెంకటరత్నం



కొండపల్లి డీఏవీ పాఠశాల్లో క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు



తిరువూరులో పోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు రామచంద్రారెడ్డి



రెడ్డిగూడెం హైస్కూల్లో పోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు విజయభాస్కరరెడ్డి



గంపలగూడెం హైస్కూల్లో మండల స్థాయి పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ శ్రీలక్ష్మి



ముసునూరులో క్రీడా ప్రాంగణాలను ప్రారంభిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ తదితరులు



విస్సన్నపేటలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీపీ మెర్సీవనజాక్షి, ఎంపీడీఓ

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు

విస్సన్నపేట: తక్కువ ఖర్చుతో ప్రకృతి వ్యవసాయం చేసి, అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు సీత అన్నారు. స్థానిక వైఎస్సార్ క్రాంతిపథం కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయం కార్యాచరణ ప్రణాళికకు సంబంధించి మండల మహిళా సమాఖ్య సమావేశం బుధవారం నిర్వహించారు. తక్కువ ఖర్చుతో వ్యవసాయం చేసి ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలన్నారు. ఏటీఎం మోడల్ పద్ధతిలో తక్కువ విస్తీర్ణంలో కూరగాయలు, ఆకుకూరలు, పంటలు సాగు చేయాలన్నారు. వైఎస్సార్‌క్రాంతి పథం ఏరియా కో-ఆర్డినేటర్ రాజశ్రీ, ఏపీఎం జమలయ్య, ప్రకృతి వ్యవసాయ విభాగం కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్నదానం

విస్సన్నపేట: లయన్స్‌క్లబ్ వ్యవస్థాపకుడు మెల్విన్ జోన్స్ జయంతి కార్యక్రమాన్ని పురస్కరించుకుని లయన్స్‌క్లబ్ ఆఫ్ విస్సన్నపేట ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమం స్థానిక లయన్స్‌క్లబ్ మల్టీహాల్ వద్ద బుధవారం నిర్వహించారు. లయన్స్ క్లబ్ సీనియర్ సభ్యులు కుక్కడపు ప్రసాదరావు, గంధం సత్యహనుమంతరావు సౌజన్యంతో అన్నదాన వితరణ నిర్వహించారు. ఈ నెల 13న మెల్విన్ జోన్స్ జయంతి సందర్భంగా నాలుగు రోజులు అన్నదానం జరుగుతుందన్నారు. క్లబ్ అధ్యక్షుడు వేమూరి శ్రీనివాసరావు, కార్యదర్శి డాక్టర్ మొలుగుమాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గాలాయగూడెం వెళ్లి పింఛన్ అందజేత

ముసునూరు: మండలంలోని రమణక్కపేటకు చెందిన ఉప్పే దుర్గ దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తురాలు. 10 రోజుల ముందు ఏలూరులోని ఓ ఆస్పత్రిలో చేరి చికిత్స పొంది, గాలాయగూడెంలోని కుమార్తె ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటోంది. ఆమె తన స్వగ్రామానికి వచ్చి పింఛన్ అందుకోలేని పరిస్థితి. దీంతో వలంటీరు దగ్గుమల్లి షేబారాణి, గృహసారథి సుధీర్‌బాబుతో కలిసి బుధవారం దెందులూరు మండలం గాలాయగూడెం చేరుకుని పింఛన్ రూ.5 వేలు అందజేశారు.

పారిశుద్ధ్య కార్మికులు సమ్మె విరమిస్తారు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేపట్టిన మున్సిపల్ పారిశుద్ధ్యం కార్మికులు సమ్మె విరమించినట్లు కొండపల్లి మున్సిపాల్టీ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్మిక సంఘాల నాయకులతో ప్రభుత్వం జరిపిన చర్చలు సఫలం కావడంతో తాత్కాలికంగా సమ్మె నిలిపేశారని పేర్కొన్నారు. హామీల అమలుపై ప్రభుత్వం నుంచి జీఓ విడుదల అయ్యాక పూర్తిస్థాయిలో సమ్మె విరమిస్తారని కమిషనర్ పేర్కొన్నారు. విధులకు హాజరయ్యేందుకు సుముఖత వ్యక్తం చేశారని తెలిపారు.

ప్రజలందరికీ ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే మేకా వెంకటప్రతాప్ అప్పారావు



నూజివీడు ఎమ్మార్ అప్పారావుకాలనీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటప్రతాప్ అప్పారావు

నూజివీడు: ప్రజలందరికీ ఆరోగ్య భాగ్యమే ధ్యేయంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరాలను నిర్వహిస్తోందని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. పట్టణంలోని ఎమ్మార్ అప్పారావు కాలనీలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజలు కార్పొరేట్ ఆస్పత్రులకు వెళ్లి పరీక్షలు చేయించుకుని వైద్య చికిత్స పొందలేని స్థితిలో ఉంటారని గ్రహించి ప్రభుత్వమే వారి ఆరోగ్య సమస్యలను పరిష్కరించేందుకు నడుం కట్టిందన్నారు. అనంతరం పరీక్షలు చేయించుకున్న వారికి మందుల కిట్లను, వృద్ధులకు కళ్లజోళ్లను ఎమ్మెల్యే ప్రతాప్ చేతుల మీదుగా అందజేశారు. మున్సిపల్ కమిషనర్ సయ్యద్ అబ్దుల్ రషీద్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము, కౌన్సిలర్ రజియా బేగం, వైద్యులు నరేంద్ర కృష్ణ, కొలుసు సౌమ్య, మున్సిపల్ డీఈ లక్ష్మీనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు మస్తాన్, నౌషీ పాల్గొన్నారు.

దేశానికే తలామానికం అంబేడ్కర్ విగ్రహం

నూజివీడు: విజయవాడలో ఏర్పాటు చేసిన 125 అడుగుల ఎత్తైన అంబేడ్కర్ విగ్రహం దేశానికే తలామానికమని ఎమ్మెల్యే మేకా వెంకటప్రతాప్ అప్పారావు అన్నారు. ఈనెల 19న బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో బుధవారం నాయకులు, కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహా సంకల్పంతో విజయవాడ నడిబొడ్డున అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోగలిగామన్నారు. అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు నియోజకవర్గంలోని నలుమూలల నుంచి పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు, దళితులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హిస్టరీ అకాడమీ డైరెక్టర్ స్వరూపరాణి, పెరిక కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ అత్తి పార్వతి, జెడ్పీ వైస్ చైర్మన్ కృష్ణంరాజు, మున్సిపల్ వైస్ చైర్మన్లు సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీలు వరికూటి ప్రతాప్, పిన్నిబోయిన వీరబాబు, వైఎస్సార్ సీపీ నూజివీడు పట్టణ, ఆగిరిపల్లి, చాట్రాయి మండలాల అధ్యక్షుడు శీలం రాము, పలగాని నరసింహారావు, మిద్దే బాలకృష్ణ, ఆగిరిపల్లి, ముసునూరు ఎంపీపీలు గోళ్ల అనూష, కొండా దుర్గాభవాని, చాట్రాయి వైస్ ఎంపీపీ పుచ్చకాయల సుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనారిటీ విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షుడు చరణ్, నాయకులు నగేష్, అశోక్, నాని, రవీంద్రరెడ్డి పాల్గొన్నారు.

శరవేగంగా ఇంటింటికీ తాగునీటి పైప్‌లైన్ పనులు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి పాతఆర్సీఎం కాలనీ వాసుల తాగునీటి అవసరాలు తీర్చేందుకు ఇంటింటికీ తాగునీటి కుళాయి పనులు శరవేగంగా సాగుతున్నాయి. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.10లక్షల వ్యయంతో 200 తాగునీ కుళాయిలు ఇంటింటికీ ఏర్పాటు చేయనున్నారు. సుమారు 600మీటర్ల పొడవున మార్కెట్ సెంటర్ నుంచి ఎర్త్‌వర్క్ పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే కొత్త ఆర్సీఎం కాలనీలో రూ.40లక్షల ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులతో 400 ఇంటింటి కుళాయిలు ఏర్పాటు చేసినట్లు ఏడో వార్డు కౌన్సిలర్ కుమ్మరి నాగసుధ తెలిపారు. వార్డులో తాగునీటి అవసరాలకు సహకరించిన ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు



గాయపడిన మహిళ

గుంటుపల్లి (ఇబ్రహీంపట్నం): స్కూటీ అదుపు తప్పి పడిన ప్రమాదంలో ఓ గుర్తుతెలియని మహిళ గాయపడింది. 65వ నంబర్ జాతీయ రహదారిపై గుంటుపల్లి శివారు ఖాజీపేట వద్ద బుధవారం ప్రమాదం జరిగింది. ఇబ్రహీంపట్నం వైపు నుంచి విజయవాడ వైపు స్కూటీపై వెళుతున్న ఆమె ఖాజీపేట వద్ద అదుపు తప్పి పడటంతో గాయపడి స్పృహతప్పి పడిపోయింది. స్థానికుల సమాచారంతో 108 సిబ్బంది విజయవాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బుర్కా వేసుకుని ఉన్న ఆమె వివరాలు తెలియరాలేదని స్కూటీని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విజయలక్ష్మి తెలిపారు.

రుణాల సద్వినియోగంతో ఆర్థికాభివృద్ధి

ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్



రుణాలు అందజేస్తున్న ఎమ్మెల్యే వసంత

మైలవరం: రైతులు రుణాలు సద్వినియోగం చేసుకుని ఆర్థిక అభివృద్ధి సాధించాలని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ తెలిపారు. మైలవరం పీఏసీఎస్ రుణ మేళాలో ఎమ్మెల్యే వసంత పాల్గొని 42మంది రైతులకు వివిధ రకాల రుణాలను రైతులకు బుధవారం అందజేశారు. అనంతరం పట్టణంలో మూడో గ్రామ సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.20 లక్షలతో సిమెంట్ రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మైలవరం 5వ సచివాలయం పరిధిలో రూ.26 లక్షలతో గడప గడపకు మన ప్రభుత్వం మండల పరిషత్ నిధులతో నిర్మించిన రెండు సిమెంట్ రోడ్లు ప్రారంభించారు.

గోదాదేవి అమ్మవారికి సారె సమర్పణ



గంపలగూడెంలో సారె సామగ్రితో గ్రామోత్సవంలో పాల్గొన్న మహిళలు

గంపలగూడెం: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా గంపలగూడెం సీతారామచంద్రస్వామి ఆలయంలో గోదాదేవి అమ్మవారికి బుధవారం మహిళలు సారె సమర్పించారు. ఉదయాన్నే మహిళలు తిరుప్పావై పఠనంగావించారు. సారె సామగ్రిని పట్టుకుని మేళ తాళాలతో గ్రామంలోని ప్రధాన రహదారుల్లో మహిళలు ఊరేగింపు జరిపారు. అనంతరం ఆలయానికి చేరుకుని నూతన వస్త్రాలు, పసుపు, కుంకుమ, గాజులుతో పాటు 90 రకాల పండ్లు, స్వీట్స్, డ్రైఫ్రూట్స్‌ను అమ్మవారి విగ్రహం ముందు ఉంచారు. ఆలయ అర్చకులు దేవయజనం శ్రీధర్ ఆచార్యులు రామాచార్యులు పూజలు చేశారు. ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు కోదండరామ్ పాల్గొన్నారు.

వెన్న చిలికే ఉత్సవం

తిరువూరు: ధనుర్మాస సందర్భంగా తిరువూరు వేంకటాచలస్వామి దేవస్థానంలో బుధవారం వెన్న చిలికే ఉత్సవాన్ని సంప్రదాయబద్ధంగా జరిపారు. మహిళలు తిరుప్పావై పఠిస్తూ గోవర్ధనుడికి వెన్న చిలికి సమర్పించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలాచార్యుల ఆధ్వర్యంలో ధనుర్మాస పూజలు నిర్వహించారు. రాజ్యలక్ష్మీ సమేత రంగనాయకస్వామి ఆలయంలో స్వామికి బంగారు నేత్రాలను ఎర్రపోతు మధుసూదనరావు వితరణ ఇచ్చారు. కోదండ రామాలయంలో ముత్యాల హారతి, తిరుప్పావై పఠన కార్యక్రమాలు విఠలాచార్య ఆధ్వర్యంలో జరిపారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

తిరువూరు: విద్యార్థులు, యువకులు నాయకత్వ లక్షణాలు అలవరచుకోవాలని అఖిల భారత యువజన సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి నక్కా లెనిన్ బాబు అన్నారు. తిరువూరు సీపీఐ కార్యాలయంలో ఏఐవైఎఫ్ ఎన్టీఆర్ జిల్లా మహాసభ బుధవారం నిర్వహించారు. హక్కుల సాధనకు పోరాటాలే శరణ్యమని పేర్కొన్నారు. ఏఐవైఎఫ్ నాయకులు లంగా గోవిందరాజులు, సుభానీ, మాలపాటి ఉదయ్, దోనేపూడి శంకర్, సీపీఐ నాయకులు తూము కృష్ణయ్య, చిలుకూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సచివాలయాలు ఆధునిక దేవాలయాలు



సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్

జి.కొండూరు: గ్రామ సచివాలయాలు ఆధునిక దేవాలయాలుగా అవతరిస్తున్నాయని ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్ అన్నారు. మండల పరిధి కుంటముక్కల గ్రామంలో రూ.43.6లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనం, రూ.23.94లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్ల ఏర్పాటుతో ప్రభుత్వ పాలనను గడప వద్దకే చేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లలా పాలన కొనసాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి అధికారంలోకి వచ్చేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు.

సంక్రాంతి వేషధారణ పోటీలు

తిరువూరు: స్థానిక సిద్ధార్థ స్కూల్లో సంక్రాంతి సందర్భంగా విద్యార్థులకు సంప్రదాయ వేషధారణ పోటీలు నిర్వహించారు. హరిదాసులు, గోదాదేవి తదితర వేషధారణలో బాలబాలికలు అలరించారు. సంక్రాంతి విశిష్టతను కరస్పాండెంటు చక్రపాణి వివరించారు. పాఠశాల ఆవరణలో రంగవల్లులు ఆకట్టుకున్నాయి.

మూఢనమ్మకాల నిరోధానికి కృషి

తిరువూరు: సమాజంలో నెలకొన్న మూఢనమ్మకాల నిరోధానికి సామాజిక సేవా సంస్థలు కృషిచేయాలని తిరువూరు ఇన్‌చార్జి ఎంపీడీఓ నాగేశ్వరరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జనవిజ్ఞాన వేదిక రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. బాల్య వివాహాలు, బాలకార్మిక వ్యవస్థల నిరోధానికి, మూఢాచారాల నిర్మూలనకు జనవిజ్ఞాన వేదిక కృషి చేస్తోందని అభినందించారు. జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి యల్ గంగాధర్, స్థానిక ప్రతినిధులు రాంప్రదీప్, హరికృష్ణ, పాపారావు, శీనయ్య, సుధాకర్, సుదర్శన్, సుభానీ పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో ఎల్బీఆర్‌సీఈ విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులతో జయప్రకాష్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, బేబీరాణి

మైలవరం: స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు పవర్ లిఫ్టింగ్‌లో ప్రతిభ కనబర్చి పతకాలు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే. అప్పారావు బుధవారం తెలిపారు. ఈ నెల 9న సూరంపాలెం ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన జేఎన్‌టీయూకే పవర్ లిఫ్టింగ్(మెన్ అండ్ ఉమన్), బెస్ట్ ఫిజిక్ పోటీల్లో రెండు గోల్డ్, ఐదు రజత పతకాలు, రెండు కాంస్య పతకాలు, బాలికల విభాగంలో ఓవర్‌ఆల్ చాంపియన్ ఏపీలో విన్నర్స్‌గా నిలిచినట్లు పేర్కొన్నారు. బాలుర విభాగంలో పవర్ ఆల్ చాంపియన్‌షిప్‌లో రన్నర్స్‌గా నిలిచినట్లు తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన ఏపీడీ బేబీ రాణి, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాధిపతి డాక్టర్ రాజ్‌కుమార్, జిమ్ కోచ్ నటరాజన్ కళాశాల గౌరవ చైర్మన్ లకిరెడ్డి జయప్రకాష్‌రెడ్డి, ప్రెసిడెంట్ జీ శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ అభినందించారు.